క్లుప్తంగా

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



రుద్రూర్: ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని కోటగిరి ఎంపీడీవో మనోహర్ రెడ్డి సూచించారు. పోతంగల్ మండలం జల్లాపల్లి, పోతంగల్‌లో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులు, నర్సరీలను శుక్రవారం ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను ఫీల్డ్ అసిస్టెంట్లకు అందజేశారు.

మొక్కలను సంరక్షించాలి



వర్ని: నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని ఎంపీడీవో బషీరుద్దీన్ పేర్కొన్నారు. మండలంలోని జాకోరాలో నర్సరీని, కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. శిబిరంలో రోగులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తూ అవసరమైన వారికి మందులు ఇవ్వాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం నాటికి మొక్కలను ఆయా గ్రామాల్లో నాటేందుకు సిద్ధం చేయాలని నర్సరీ సిబ్బందికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ కార్పొరేషన్ అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. పట్టణంలోని షాదీఖానాలో శుక్రవారం మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటార్వ్యూలు నిర్వహించారు. మొత్తం 850మంది మైనార్టీ కార్పొరేషన్‌కు రుణాల దరఖాస్తు చేసుకోగా, మొదటి రోజు 350మంది ఇంటార్వ్యూలు నిర్వహించారు. శనివారం సైతం ఇంటార్వ్యూలు కొనసాగుతాయ అధికారులు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్, వార్డు అధికారులు, మెప్మా, ఆర్పీలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాల రక్షణకు చర్యలు చేపట్టండి

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పంచాయతీ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ ఆదేశాలిచ్చారు. ఈ మేరకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి మెమోను జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జీపీ స్థలాల ఆక్రమణలు జరిగితే వాటిని తొలగించాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫిబ్రవరిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఆదేశాలు జారీ చేస్తున్నామని డీపీవో పేర్కొన్నారు. పంచాయతీ స్థలాల రక్షణ కోసం ఎంపీవోకు, పోలీసులకు కూడా డీపీవో జారీ చేసిన కాపీ చేరింది.

సుందరయ్యకు ఘన నివాళి



నవీపేట/ఆర్మూర్‌టౌన్/వర్ని: ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్యకు సీపీఎం నాయకులు ఘన నివాళులు అర్పించారు. శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భంగా నవీపేట, ఆర్మూర్, వర్నిలో సీపీఎం నాయకులు వర్ధంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన ఉద్యమ పటిమను కొనియాడారు. సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి కల్యాణోత్సవం



రుద్రూర్: మండల కేంద్రంలో చౌడేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి కల్యాణ మహోత్సవం వైభవంగా కొనసాగింది. అంతకుముందు ఉదయం గ్రామంలో దేవి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బస్టాండ్ ఉన్నా.. బయటనే బస్సులు

- బోధన్‌లో ప్రయాణికుల అవస్థలు
- నిజామాబాద్, హైదరాబాద్ బస్సులు ఆరుబయటే..



బోధన్ బస్టాండ్ బయట బస్సు వద్ద ప్రయాణికులు

బోధన్: బోధన్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు మండే ఎండల్లోనే బస్సెక్కాల్సిన పరిస్థితి నెలకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వయో వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు ఎండల్లో నిలబడి నిరీక్షించి బస్సెకేందుకు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్‌ల్లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ప్రయాణికుల కష్టాలు గుర్తించి, తగిన చర్యల చేపట్టడంపై డిపో అధికారులు దృష్టి పెట్టలేక పోతున్నారు.

దూరప్రాంత బస్సులు దూరంగా..

బోధన్ ఆర్టీసీ డిపో నుంచి నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్, ఏపీ రాష్ట్రంలోని ఒంగోలు ప్రాంతాలకు నిత్యం నడిపే బస్సులను బస్టాండ్ భవనం ఆవరణలోని ఆరుబయట నిలుపుతున్నారు. బోధన్ నుంచి నిజామాబాద్ నగర కేంద్రానికి 20 బస్సులు 10నిమిషాల నిడివితో ఉదయం నుంచి రాత్రి వరకు నడుపుతున్నారు. ఈ రూట్‌లో ప్రయాణికుల రాకపోకలు నిత్యం వేల సంఖ్యలో ఉంటుంది. నిజామాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులకు బస్టాండ్ భవనంలోని ప్లాట్‌ఫాం నంబర్ 2ను కెటాయించినా ప్రయాణికులు ఆరుబయటనే నిలబడేందుకు సుముఖత చూపుతున్నారని డిపో అధికారులంటున్నారు. కానీ తాత్కాలికంగానైనా నీడ కల్పించే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

శిథిలావస్థలో షెడ్డు..

మూడు దశాబ్దాల క్రితం బోధన్ ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేశారు. అదే సమయంలో ప్రధాన రోడ్డు అంచున రేకుల షెడ్డు నిర్మించి బస్టాండ్ ప్రారంభించారు. ఈ షెడ్డును నిజామాబాద్, హైదరాబాద్ ఇతర దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులకు ప్లాట్‌ఫాంగా మార్చారు. ఏళ్లుగా ప్లాట్‌ఫాంగా కొనసాగింది. ప్రస్తుతం ఈ రేకుల షెడ్డు ముందుభాగంలో మున్సిపల్ శాఖ సీసీ డ్రెయినేజీ నిర్మించారు. దీంతో అక్కడ బస్సులు నిలిపే పరిస్థితి లేదు. ప్రస్తుతం రేకుల షెడ్డు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. బస్టాండ్‌కు ఆధునాత భవనం కొన్నేళ్ల క్రితమే నిర్మించి ఐదు



ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేశారు. ఇటీవల మరో 8 ప్లాట్‌ఫాంలతో విస్తరిస్తు నూతన భవనం నిర్మించారు. పాత, కొత్త భవనాల్లో మొత్తం 13 ఫ్లాట్‌ఫాంలు ఏర్పాటయ్యాయి. నిత్యం ఈ బస్టాండ్ మీదుగా 15వేల మందికి పైగా ప్రయాణికుల రాకపోకలుంటాయి. డిపోనుంచి 110 బస్సులు నడుపుతున్నారు. రోజువారీగా 42వేల కిలోమీటర్ల పొడువున బస్సుల రవాణా ఉంటుంది.

ప్రయాణికులకు నీడ కల్పించాలి..

ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున బస్టాండ్‌లో ప్రయాణికులకు తాత్కాలికంగానైనా నీడ కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. వడదెబ్బ వల్ల ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంటుందనే విషయం గుర్తించాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

–పుట్ట వరదయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్‌కార్యదర్శి, బోధన్

ప్లాట్‌ఫాం వైపు రావడం లేదు

బస్టాండ్‌లో ప్లాట్‌ఫాం నంబర్ 2ను నిజామాబాద్ వైపు వెళ్లే బస్సులకు కేటాయించాం. ప్రయాణికులు ప్లాట్‌ఫాం వైపు రావడం లేదు. గతంలో ప్లాట్‌ఫాం వైపు మళ్లించేందుకు ప్రయత్నాలు చేశాం. ఎండల తీవ్రత దృష్ట్యా నీడ కల్పించే యోచనలో ఉన్నాం.

–టీఎస్ స్వామి, ఆర్టీసీ డిపో మేనేజర్, బోధన్

కొనసాగుతున్న వీవోఏల సమ్మె

మోర్తాడ్/ఆర్మూర్‌టౌన్/వర్ని/బాల్కొండ: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మె శుక్రవారం 26వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా వర్నిలో వీవోఏలు ముగ్గులు వేసి నిరసన వ్యక్తం చేశారు. అలాగే మోర్తాడ్, ఆర్మూర్, బాల్కొండలోనూ సమ్మె కొనసాగుతోంది. పలువురు వీవోఏలు మాట్లాడుతూ.. తమకు కూడా వేతనం పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సీఎం కేసీఆర్ స్పందించి వీవోఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.



వర్నిలో ముగ్గు వేసి, నిరసన తెలుపుతున్న వీవోఏలు



మోర్తాడ్‌లో సమ్మె చేస్తున్న వీవోఏలు



ముప్కాల్ మండల కేంద్రంలో..

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న లక్కోర, అమీనాపూర్ గ్రామస్తులు

వేల్పూర్: మండలంలోని లక్కోర, అమీనాపూర్ గ్రామాలకు చెందిన బీజేపీ, బీఎస్పీ పార్టీల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఆర్అండ్‌బీ శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. నాయకులు మధుశేఖర్, మాదస్తు శ్రీనివాస్, ఆకుల రాజేశ్వర్, డీసీసీబీ వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్ మండలంలో..

మాక్లూర్: మండలంలోని ధర్మారం, లక్మాపూర్, గొట్టిముక్కల గ్రామాల్లోని ఆయా పార్టీలకు చెందిన యువకులు శుక్రవారం సుమారు 50మంది బీఆర్ఎస్ పార్టీలో చేరినట్టు పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అభిలాష్ తెలిపారు. బీఆర్ఎస్ అభివృద్ధి సంక్షేమ పథకాలకు యువకులు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్టు వెల్లడించారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ



భీమ్‌గల్ మండలంలో జీలుగ విత్తనాల బస్తాలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

భీమ్‌గల్: మండలంలోని ముచ్కూర్, బడా భీమ్‌గల్ సొసైటీలలో శుక్రవారం రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్ పంపిణీ చేశారు. నాయకులు నర్సయ్య, వెంకటేష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రుద్రూర్: మండలంలోని రాయకూర్ సింగిల్ విండోలో జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ నరోజి గంగారాం ప్రారంభించారు. ఏవో నగేష్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సంగమేశ్వరరావ్, ఏఈవో శ్రావణి పాల్గొన్నారు.

నేటి నుంచి ఎడపల్లిలో..

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి సొసైటీ నందు శనివారం నుంచి జీలుగ విత్తనాలు 65 శాతంపై సబ్సిడీపై పంపిణీ చేయనున్నట్లు ఏవో సిద్ధిరామేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనుల పరిశీలన

కమ్మర్‌పల్లి/వేల్పూర్: కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో చేపడుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను కమిషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డిప్యూటీ ఈఈ నాగభూషణం శుక్రవారం పరిశీలించారు. పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీఈఈ మాట్లాడుతూ ఎస్బీఎం 2.0 కేంద్ర స్థాయి అవార్డు సాధించాలంటే చేపట్టాల్సిన అంశాలు, వాటి ప్రాముఖ్యతను కార్యదర్శి గంగాజమున, పాలకవర్గం సభ్యులకు వివరించారు. అలాగే వేల్పూర్ మండలం పడగల్ ఒడ్డెర కాలనీలోనూ ఆయన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఎంపీడీవోలు సంతోష్‌రెడ్డి, కమలాకర్ రావు, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ శంకర్, ఏపీఓ విద్యానంద్, ఎస్బీఎం కోఆర్డినేటర్లు నరేష్, రాజు, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి 23, 25, 26, 3వ వార్డుల్లో శుక్రవారం నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలను మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ ప్రారంభించారు. అలాగే మండలంలోని చేపూర్‌లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య వారోత్సవాలను ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. సర్పంచ్ సాయన్న, కౌన్సిలర్ రేవతి పాల్గొన్నారు.

బాల్కొండ:మెండోరా మండలంలో మెండోరా, బుస్సాపూర్, వెల్కటూర్, సోన్‌పేట్ గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను డీఎల్పీవో శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవోసాయిలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఉన్నారు.



పడగల్ ఒడ్డెర కాలనీలో పనులను పరిశీలిస్తున్న సీఆర్‌డీ జిల్లా కోఆర్డినేటర్ నాగభూషణం



చౌట్‌పల్లిలో..



మామిడిపల్లిలో..



మెండోరా మండలంలో..

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం





డొంకేశ్వర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు.. రెంజల్‌లో..

డొంకేశ్వర్/పెర్కిట్/మాక్లూర్/ఆర్మూర్‌టౌన్/రెంజల్/వర్ని/కమ్మర్‌పల్లి/వేల్పూర్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల్లో వీఆర్ఏలు శుక్రవారం సీఎం కేసీఆర్, మంత్రులు ప్రశాంత్ రెడ్డి, హరీష్‌రావు, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను రెగ్యులర్ చేయడంతో పాటు పే స్కేల్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వీఆర్ఏలు స్వీట్లు పంచుకున్నారు. నిజామాబాద్ జిల్లా వీఆర్ఏల సంఘం సభ్యులు వేల్పూర్‌లో ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



కమ్మర్‌పల్లిలో..



ఆర్మూర్ మండలంలో..



వర్ని మండల కేంద్రంలో..



వేల్పూర్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న వీఆర్ఏలు

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌లోని ఐటీఐ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను వివిధ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శాంతారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రిషియన్, డ్రాఫ్టమెన్ సివిల్, ఫిట్టర్, కోప, డ్రెస్ మేకింగ్, డీజిల్ మెకానిక్, వెల్డర్ కోర్సులలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిసున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 10 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మాక్లూర్: మాక్లూర్, నందిపేట మండలాల పరిధిలో నేడు 3గంటలపాటు విద్యుత్ సరాఫరా ఉండదని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి 6గంటల వరకు విద్యుత్ సరాఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రెంజల్ మండలంలో..

రెంజల్(బోధన్): రెంజల్‌లోని 132/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నేడు మరమ్మతులు చేపట్టడంతో పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ రాజలింగం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు. మండలంలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూతన కార్యవర్గం..

ఆదివాసి నాయక్‌పోడు సేవా సంఘం..



నందిపేట్ (ఆర్మూర్): మండలకేంద్రంలో శుక్రవారం ఆదివాసి నాయక్‌పోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రామచందర్ ఆధ్వర్యంలో మండల సంఘం ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా మన్నెసాగర్, ఉపాధ్యక్షులుగా నేరడి రవి, సాగర్, ప్రధాన కార్యదర్శిగా దేవదాస్, కోశాధికారిగా మల్లయ్య, రవి, మహేష్, భోజన్న ఎన్నికయ్యారు.

ముస్లిం తంజీమ్ కమిటీ..

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ ముస్లిం తంజీమ్ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్‌రహీమొద్దీన్, ఉపాధ్యక్షుడిగా ఎంఏ ఖలీద్, ప్రధాన కార్యదర్శిగా షేక్ యూసుఫ్, సంయుక్త కార్యదర్శిగా అన్వర్, కోశాధికారిగా ఎండీ వాహెద్ ఎన్నికయ్యారు.

మాక్లూర్ వీఆర్ఏల సంఘం



మాక్లూర్: మండలానికి చెందిన వీఆర్ఏలు శుక్రవారం మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ జాఫర్, ప్రధాన కార్యదర్శిగా సిలార్ అహ్మద్, ఉపాధ్యక్షులుగా బ్యాగరి రాజేశ్వర్, జనార్దన్‌గౌడ్, కోశాధికారిగా గంగాధర్, సంయుక్త కార్యదర్శిగా ముత్యం, ముఖ్య సలహదారుడిగా నీరడి పోశెట్టిలను ఎన్నుకున్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 –	కస్టడీ – 12.20, 6.30 ది కేరళ స్టోరీ (తెలుగు) – 3.30 విరూపాక్ష – 9.40
స్క్రీన్-2 –	ఫస్ట్ ఎక్స్(ఇంగ్లీష్) 3డీ – 1.00, 4.00, 7.00 ఫస్ట్ ఎక్స్(ఇంగ్లీష్) 3డీ – 1.00, 7.00
స్క్రీన్-3 –	అన్నీ మంచి శకునములే – 11.45, 3.00, 6.15, 9.30
స్క్రీన్-4 –	బిచ్చగాడు2 – 12.15, 3.30, 6.45, 10.00

సంక్షిప్తం

కంటివెలుగు శిబిరం ప్రారంభం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్ ప్రారంభించారు. ప్రత్యేక అధికారిణి వెంకటరమణమ్మ, కార్యదర్శి రవి కుమార్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు భూమిపూజ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 36వ వార్డులో శుక్రవారం బీటీ రోడ్డుకు మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత భూమి పూజ చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహన్, డీఈ భూమేష్, కౌన్సిలర్ బారడ్ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



రెంజల్(బోధన్): మండలంలోని కూనేపల్లి, బాగేపల్లి, దూపల్లి గ్రామాల్లో శుక్రవారం బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు సాయిలు, సాయరెడ్డి, విజయ ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక

బాల్కొండ: ముప్కాల్ జెడ్పీహెచ్ఎస్‌లోని ఏడుగురు విద్యార్థులు నేషనల్ మెరిట్, స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం నరేందర్ తెలిపారు. విద్యార్థులు అన్వేష్, వర్షిణి, ప్రసజ్ఞ, నాగలక్ష్మీ, గంగామణి, సంజన, అనులను అభినందించారు.

వేల్పూర్: మండలంలోని మోతె ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు శివన్విత, నిహారిక, శ్రీనిధి, సుశాంత్ ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం లింగన్న తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మిర్దాపల్లి గ్రామంలో పలు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులు అందజేశారు. ఎంపీటీసీ భూమన్న, బీఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గోడప్రతుల ఆవిష్కరణ

భీమ్‌గల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం ప్రిన్సిపల్ సతీష్ ఆధ్వర్యంలో శుక్రవారం గోడప్రతులను ఆవిష్కరించారు. కళాశాలలో అడ్మిషన్లు ఈనెల 16నుంచి ప్రారంభమయ్యాయని, జూన్ 10 వరకు మొదటి విడతలో అడ్మిషన్‌లు పొందవచ్చన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న యువతి యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్రికెట్ కిట్ల అందజేత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సిక్కుల కాలనీలో శుక్రవారం రెండో వార్డు కౌన్సిలర్ ఖాందేష్ సంగీతా యూత్ సభ్యులకు క్రికెట్‌కిట్లను అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు ఖాందేష్ సత్యం, సాయినాథ్, నరేశ్, మహేష్, సాయిలు, రాజు, శివ, మేతాబ్ సింగ్, హర్బజన్ సింగ్, యూత్ సభ్యులు ఉన్నారు.